'నువ్వు... మీరు... అదే నువ్వు సావిత్రి కదు?'

దక్షిణామూర్తి ఆ ప్రశ్న అడగడానికి ఆమెని చూసిన అరగంటకి గాని తెగించలేకపోయేడు.

❈ ❈ ❈

రాజమండ్రి స్టేషన్‌లో రైలెక్కింది ఆవిడ.

ఒచ్చే జనాన్నీ, పోయే జనాన్నీ తోసుకుంటూ, తప్పించుకుంటూ ఆవిడ ఆ సీటుకి చేరేలోపల ప్లాట్ ఫారం మీంచి ఓ అబ్బాయి కిటికీ లోంచి చెయ్యిపెట్టి అక్క డొక రుమాలు పెట్టాడు.

ఆవిడ రాగానే దక్షిణామూర్తి ఆ రుమాల్ని జరిపి, 'మీరలా కూచోండి' అన్నాడు.

ఆవిడ కిటికీ పక్కనున్న సీటులో కూచుంది.

ఒక్క నిమిషం కూర్చున్నాక, దక్షిణామూర్తి ఆవిడ ఒళ్లో పెట్టుకున్న సూట్‌కేసువేపు చూపించి, 'పైన పెట్టా' నన్నట్లు సంజ్ఞ చేశాడు.

ఆమె కళ్లతోనే ఆమోదం చెప్పింది.



# కూతుళ్ళ తండ్రి

భరాగో

ఇంతలోకి రుమాలు కుర్రా డొచ్చాడు.

'ఆ సీటు నాది' అన్నాడు.

దక్షిణామూర్తి 'కూచో' అని సంజ్ఞ చేశాడు.

అతను కూర్చున్నాడు. కూర్చునీకూడా 'ఆ సీటు నాది!' అని కొంచెం తీవ్రంగా అన్నాడు.

దక్షిణామూర్తి నిదానంగా మాట్లాడాడు.



వేద పండితులు ద్వాదశి విశ్వనాథశర్మ సోదరులు, పన్నాల సుబ్రహ్మణ్యభట్టు, గొల్లపూడి మారుతిరావు, మల్లాది సూరిబాబు, రాంభట్ల నృసింహశర్మల మధ్య భరాగో సత్కారసభ(విశాఖపట్నం-మార్చి 8, 2003)

'అవునయ్యా... ఆ సీటు నీదే; కోసేసి పట్టుకుపోడానికి రంపంలాటిది ఏదైనా తెచ్చావు కాబోలు, ఇప్పుడే కోసేస్తావా, రైలు బెజవాడ వరకూ వెళ్లేదాకా ఆగ్గలవా?'

ఆ అబ్బాయి నవ్వాడు. 'మీరు బలే తమాషాగా మాట్లాతారండీ!' అన్నాడు.

ఆవిడ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ కిటికీ అవతలివేపుకి చూడ్డం మొదలెట్టింది. అక్కణ్నించే మొదలు దొంగచూపులు.

ఈ అరగంటా అలాగే గడిచిపోయింది.

ఆవిడ పొలాల వేపూ, చెట్ల వేపూ చూస్తోం దన్నమాటే గాని ఓ కన్ను ఇటే ఉంచింది.

తను దీక్షగా ఆవిడ్నే చూస్తున్నట్టు ఆవిడకి అర్థమైపోయింది.

తనకి ఆవిణ్ని పలకరించాలనే ఉంది.

ఆవిడికీ ఉన్నట్టే ఉంది.

రెండు చేతులు కలిస్తే చప్పట్లు. కానీ, ఒక్క నాలుకే చాలు మాట్లాడ్డానికి. ఈ అరగంట సేపట్నుంచీ ఆ రెండు నాలుకల్లో ఏ ఒక్కటీ సిద్ధం కాలేదు మరి.

❊ ❊ ❊

'బావున్నావా...? సార్ బావున్నారా?'

'కొత్త మరియాదలు నేర్చావు...'

'ఎదుటి సీట్లో కంఫోర్టబుల్‌గా కూర్చోబెట్టాను. అంతకంటే ఎక్కువ మరియాద చెయ్యడం చేతకాలేదు మరి...'

'ఊఁ. నీతో వాదించలేను గాని, చెప్పు... బావున్నావా? బెజవాడదాకా వెళ్తున్నాన్లే. ఈ మాత్రం, ఆ మాత్రం ఫ్లాష్ బేక్ వినగల్ను...'

'సావిత్రి నవ్వులో చిన్న వేళాకోళం ఉంది. ఆ రోజుల్లో...అంటే నలభై ఏళ్లనాడు ఎప్పుడు ఇద్దరం కలుసుకున్నా నేనే ఎక్కువ మాట్లాడేవాణ్ని...బోరు...' అనుకున్నాడు దక్షిణామూర్తి.

'ఎప్పుడూ నేనేనా ఏమిటి మాట్లాడ్డం?... అదేం కుదరదు. నీ ఫ్లాష్‌బేకే చెప్పు ముందర' అని -- ఎదురుగుండా కూర్చున్న అబ్బాయివేపు చూశాడు దక్షిణామూర్తి.

'అంటే మీ కిద్దరికీ ఇదివరకే పరిచయ ముందాండీ?' అన్నా డతను.

'అదేకదా, ఈ రైలు ప్రయాణాల్లో చిత్రం!' అని ప్రగల్భంగా నవ్వేడు దక్షిణామూర్తి. 'రైలెక్కి సీట్లలో సెటిలయ్యేదాకా ఆజన్మ విరోధుల్లా ప్రవర్తిస్తాం. కొంచెం సేపవగానే పరిచయాలు, మరికొంచెం సేపట్లో ఫ్లాష్ బేకులూ, ఇంకొంచెం సేపట్లో ఎడ్రసులూ టెలిఫోను నెంబర్లూ రాసుకోడాలు, ఆ తరవాత పిల్లలకి పెళ్లిసంబంధాలు చూసుకున్నా ఆశ్చర్యం లేదు.'

సావిత్రి ఆ అబ్బాయి వీపుమీద చిన్న దెబ్బలాటిది వేసింది. 'ఇవాళ నువ్వు బలైపోతావు, నాయనా, జాగర్త!'

'లేదు...లేదు. నేనే బలైపోతాను. చెప్పు, నీ సంగతంతాను. నేనూ బెజవాడకే. ఎవ రున్నారక్కడ...కూతురా, కొడుకా?'

'కూతురే. బెజవాళ్లో కాదు, ఉయ్యూరని...'

'నా కెందుకు తెలీదు...కొన్నాళ్లు అక్కడ సినిమా హాల్లో టిక్కెట్లమ్మాను.'

'ఆ హాలుకి పక్కనే మా అల్లు డిల్లు.'

'వియ్యపురా లుందా?'

'అదేకదా బాధ! ఆవిడకి నా కూతుర్ని కాల్చుకు తిండమే వ్యాపకం. అందుకని ఆవిడగారు ఇంకో కొడుకు దగ్గరికి వెళ్లిపోయే ఏర్పాటు చేసి నన్ను రమ్మంది మా అమ్మాయి.'

'అంటే, ఇంక అక్కడ పెత్తనమంతా నీదే నన్నమాట.'

సావిత్రి మొహంమీది కండలన్నీ కదిలేటంతగా నవ్వింది. 'ఎక్కడున్నా పెత్తనం నాదే. ఉన్న ముగ్గురు పిల్లల్లో, అదే, పెద్దవాడు రాజమండ్రిలో ఏదో కంపెనీకి పి.ఆర్.ఓ. రెండోవాడు నంద్యాల్లో మరో కంపెనీలో ఎకౌంటెంటు. అల్లుడికి ఉయ్యూర్లో వ్యవసాయం... గూడెం స్టేషన్ వస్తున్నట్టుంది... కాఫీవా డొస్తే పిలువ్!'

ఉన్నదున్నట్టే చెప్పినా, ప్రల్లదనంగానే చెప్పినా, దాంట్లో ఆత్మవిశ్వాసంతో పాటు ఆపేక్షని కూడా కలిపే చెప్పింది.

❊ ❊ ❊

దక్షిణామూర్తి అనుకున్నది రైటే. నలభై రెండేళ్ల కిందట ఆనాటి సావిత్రిని పెళ్లి చేసుకున్న బాదరాయణరావు అప్పుడు తాలూకా ఆఫీసులో చిన్న గుమాస్తాగానే ఉండేవాడు. తరవాత ఏదో పరీక్ష రాసి సెంట్రల్ గవర్నమెంటులోకి మారాడు. అదీ రెవిన్యూ డిపార్ట్‌మెంటే. కాని, ఎంత తేడా! ఇక్కడ టేబిలుకింద చేతులు పెట్టాలి. ఇంటికొచ్చి కలుసుకో మనాలి. అలా ఎన్నో తిప్పలు పెడితేనో, పడితేనో ఆ అంకెల తల్లి నట్టింట కాలు పెడుతుంది. ఇక్కడ అలా మలుపులు తిరిగే రోడ్లు లేవు. చాలాసార్లు కొలాయి తిప్పకుండానే నీళ్లు పడతాయి. ముగ్గురు పిల్లలకీ మూడు ఇళ్లు కట్టించి ఇచ్చాడు. ఉద్యోగాలు గవర్నమెంటులో ఇప్పించుకో లేకపోయాడుగాని, 'కష్టముల' డిపార్ట్‌మెంటులో సాధించుకున్న పలుకుబడితో అంతంత మాత్రం చదువులకన్నా ఎక్కువ సాధించుకో లేకపోయిన కొడుకు లిద్దరికీ ప్రయివేటు కంపెనీలలో మరీ అంత నాసికాని ఉద్యోగాలు ఇప్పించుకో గలిగాడు.

బాదరాయణరావు పిల్లలు ముగ్గురికీ పెళ్లి చేసిన తరువాత రెండేళ్లకి ఆఫీసరు హోదాలోనే రిటైర్ అయ్యాడు. అయితే, డాక్టర్లు ఏం చెప్పారంటే అతను పాతికేళ్లుగా అలవాటుపడ్డ ఘాటు పానీయాలు ఒక్కసారిగా(బహుశా కొనుక్కోవలసి రావడంవల్ల) మానేయడంతో... జీవనశైలి, శరీరధర్మాలు...మారిపోయి, పిడుగులా ఉన్న మనిషే చెప్పా పెట్టకుండా వాలిపోయాడని. బాదరాయణరావు హఠాత్తుగా చనిపోయిన ఉదంతం సావిత్రి అంత నిస్సంగత్వంతో ఎలా చెప్పగలిగింది అని దక్షిణామూర్తి విభ్రమ చెందాడు.

"రిటైర య్యారు...ఎనిమిది నెలలు పెన్షన్ తీసుకున్నారు. మా పెద్దబ్బాయి సెంట్రల్ ఎక్సైజ్ పనిమీద హైదరాబాదు వెళ్లాడు. కోడలు వాళ్లమ్మని చూసొస్తానని పిల్లాణ్ణి తీసుకుని అమలాపురం వెళ్లింది. అసలు ఓ ఆర్నెల్లనుంచీ గుండెల్లో మంట, నొప్పి అంటున్నారేగాని, అవి

ఎటాక్‌కి దారి తీస్తాయని డాక్టర్లూ చెప్పలేదు; మేమూ అనుకోలేదు. ఎందుకైనా మంచిదని డాక్టరుగా రిచ్చిన కొన్ని ఎమర్జన్సీ మాత్రలు ఇంట్లో పెట్టుకున్నాం. ఆవేళ సాయంకాలం నాలుగుంపావు. అంతసేపూ సోఫాలో కూచొని ఓ పక్క టీవీ చూస్తూ మూడేసి నిమిషాల కోసారి ఫోనులో మాట్లాడుతూ; ఉన్నట్టుండి 'సావీ! దిండు పట్రా' అని, అది తెచ్చేలోగానే 'టాబ్లెట్ పట్రా' అని మరో కేక వేశారు. టాబ్లెట్ చేతిలో పెట్టుకుని, నీళ్లకోసం చెయ్యి జాపారు. నేను తెల్లమొహం వేశాను. 'టాబ్లెట్ తెచ్చినదానివి నీళ్లు తేవాలని తెలీదా?' అని--అబ్బే...ఆవేశం లేదు; మామూలుగానే అడిగారు. లోపలి కెళ్లి నీళ్లు తెచ్చేసరికి అవి అందుకోవడానికి ఆయన శరీరం ఉందికాని, అందులో ప్రాణం లేదు."

బాదరాయణరావు సుఖోపజీవి. వస్తువుకాని, డబ్బుకాని తనకు కావలసిన సమస్త జంగము, స్థావర, జీవ, నిర్జీవ, అవసర, విలాస, సుఖపదార్థాలు ఏవైనాసరే; చిరునవ్వుతో రప్పించుకునేవాడు. చెడ్డవాడు అనడానికి వీలేకాని, ఎవరూ అలా అతనితోకాని, ఇంట్లోవారితోకాని అనలే దెప్పుడూనూ. 'జబ్బు పడ్డానుమొర్రో; నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లండి ...నా సేవలకోసం మీ రందరూ తిప్పలు పడండి. నేను బ్యాంకులో దాచినడబ్బు నా ఆరోగ్యం బాగుపడడానికి ఖర్చు పెట్టండి' అని ఆజ్ఞాపించలేదు. మంచాన పడి మూత్ర పురీషాలు ఎత్తి పారబోయమని హింస పెట్టలేదు. అనాయాస మరణం వినా దైన్యేన జీవనం...అన్నదానికి ఉదాహరణగా నిలిచి(పోయాడు). ధనుడే కాక, ధన్యుడు కూడానని అనిపించుకున్నాడు.

పిల్లలు సావిత్రిని ఏడవ నివ్వలేదు. పని, పని, పని...ఈ కొడుకింట్లో ఆవకాయ పెట్టడం ఉంటుంది. ఆ కోడలు ఒళ్లు మరిచి నిద్దరపోతే ఆ కొడుక్కి రాత్రిపూట నిద్ర రాకుండా కూర్చుని చదూకోడానికి టీ చేసి ఇవ్వాలి. కూతురికి నెల తప్పినా, కోడళ్లకి నెలలు నిండినా వేవిళ్ల దగ్గర్నించీ పురుళ్లదాకా ఒక రకం పని. వాళ్లు కన్న పిల్లల్ని వాళ్లకన్నా శ్రద్ధగా చూస్తాం దనిపించుకుంటూ వాళ్ల ఉచ్చగుడ్డల్ని ఉతికి, ముద్దు కడిగింది. కూతురింట్లోనూ వండింది; కొడుకు లిళ్లలోనూ వండింది. వాళ్ల పెట్టుపోతలకోసం వరండాల్లో చాపా దిండూ వేసుకొని పడుకోలేదు. కొడుకు లిళ్లల్లో ఒక్కొక్క దాంట్లోనూ కచ్చితంగా 'అమ్మగది' ఉంటే అదో గొప్ప కాదుగాని, కూతురింట్లో 'అమ్మ మంచం' ఆ కూతురి మనసులాగే విశాలం. ఆ మహారాజు (పుణ్యమో, పాపమో) కారణంగా వస్తున్న పెన్షన్ ధర్మమా అని, 'అమ్మ మా ఇంట్లో ఉండా' లంటే, 'మా ఇంట్లో' నని హఠాయిస్తారు. అందులో శ్రముంది; వేదనుంది; సంతోషం ఉంది; ఆనందం ఉంది; చిరాకుంది; అన్నీ కలిపి 'జీవితం'కన్నా మించిన 'ప్రాణం' ఉంది. ఒంటరితనం లేదు; అనారోగ్యం లేదు; దారిద్ర్యం లేదు; ముఖ్యంగా దీన్ని ఏంచెయ్యాలా అని వేదనపెట్టే తీరిక లేదు.

✻ ✻ ✻

దక్షిణామూర్తి లేచి నిలబడ్డాడు.

సూపర్ ఫాస్ట్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ అతన్ని నిటారుగానే కాక స్థిరంగాకూడా నిలవ నియ్యడంలేదు. అయినా, అతను ఎడం చేత్తో పట్టుకున్న కిటికీ కమ్మీని రెండు క్షణాలపాటు వదిలి, దాన్ని కుడిచేతిలోకి జోడించి, సావిత్రికి నమస్కారం పెట్టి తల వంచాడు.

"అదేమిటి...అదేమిటి?!" అంటూ కంగారు పడింది సావిత్రి.

ముందు ఆ రెండు చేతుల్నీ తన చేతుల్తో విడదీసింది. జబ్బలు పట్టుకుని అతన్ని కూర్చోబెట్టింది. "ఏమిటి, మూర్తీ! ఎందు కిలా చేశావు? నీ కన్నా చిన్నదాన్ని; నీ కన్నా తక్కువ చదువుకున్న దాన్ని...నాకు దండం పెట్టడ మేమిటి....ఆయుఃక్షీణం" అని కళ్లొత్తుకుంది.

"నీ గతం అంతా చెప్పావు. నీ ప్రస్తుతం అంతా చెప్పావు. నీ భవిష్యత్తంతా ఊహించాను. నీ వయసుకీ, చదువుకీ కాదు నేను నమస్కారం చేసింది. పరిపూర్ణం, నిత్య సంతోషం అయిన నీ చరిత్రకి చేశాను...గతం కొద్దిగా ఉన్నా, ప్రస్తుతంగానీ, భవిష్యత్తుగాని లేని వ్యర్థజీవిని నేను. ఆనాడు నిన్ను పెళ్లి చేసుకుందామని కోరుకున్నా, నీకు మంచి జీవితాన్ని ఇవ్వలేకపోతానన్న స్పృహతో తప్పు చెయ్యకుండా తప్పుకున్నాను. ఆ సంతోషం పట్టలేక దండం పెట్టాను."

✻ ✻ ✻

దక్షిణామూర్తి ఉన్న ఊళ్లోనే ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఆశలు ఉన్నాయిగాని, ఆ ఉద్యోగం అతన్ని ఆ ఆశలు నెరవేర్చుకునే దారికి చేరనియ్యలేదు. సంసారంలో దిగాడు. ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. వాళ్ల పెళ్లిళ్లయ్యేదాకా ఉండిన ఇల్లాలు ఆరేళ్ల కిందట పోయింది. పెన్షన్ లేదు. ఇల్లు అమ్మేసి బాకీలు తీర్చాడు. కూతుళ్లు ముగ్గురికీ కడుపులనిండా ప్రేమ ఉందిగాని, వాళ్లు ఆ అల్లుళ్ల భార్యలేగాని, తన పేగులు కారు. ఎవ రింటికి వెళ్లినా, పది రోజులకి మించి ఉండలేదు; ఉండనియ్యరు. ఓల్డేజి హోములు ఉన్నాయిగాని, వాటి నిర్వహణకూడా స్టార్ హోటళ్ల నిర్వహణకి దగ్గిరిసా ఉంటోంది. 'పని చేసి మీ ఋణం తీర్చుకుంటాను; పాతకాలం వాళ్లి కనక నా ఆలోచనలూ-దీక్షా సిన్సియరుగా ఉంటాయి; నా అక్షరశుద్ధి మంచిది...' అని చెప్పుకుంటే, మాకు అవేవీ అక్కర్లే దంటోంది కొత్తతరహా జీవనశైలి. నా పని మొగుడు చచ్చిన ముండకన్నా అధ్వాన్నంగా ఉంది; నా చదువూ, ఆలోచనా, మంచితనం, బుద్ధికుశలతా పనికిరాదం లేదు అని తెలుసుకున్నాడు.

✻ ✻ ✻


"నా మంచిని కోరావు. నీ ఆపేక్షకి నేనే దండాలు పెట్టాలి. ఆనాడు నువ్వు నన్ను పెళ్లాడుంటే, నీ అప్రయోజకత్వం ఫలితంగా నేను..." అనుకుంది సావిత్రి.

సరిగ్గా పది రోజుల తర్వాత... 'నిశ్చింత' అనే పేర ఉన్న ఒక వృద్ధాశ్రమం వారినుండి దక్షిణామూర్తికి ఒక ఉత్తరం వచ్చింది.

"అయ్యా!

కీ॥శే॥ వై. బాదరాయణరావు భార్య సావిత్రిగారు మీరు జీవించి ఉండేటంత కాలం మా సంస్థకు నెలకు రెండు వేల రూపాయలు చేరేవిధంగా ఒక బ్యాంకులో ఒక ఫిక్సెడ్ డిపాజిట్టు వేసినారు. మీరు వెంటనే మా ఆశ్రమానికి వచ్చి నిశ్చింతగా ఉండవచ్చును. మీ ప్రయాణపు ఛార్జీల నిమిత్తం రెండు వందల రూపాయలు ఇందుతో మనియార్డర్దుద్వారా పంపడమైనది." ■

## మాతృభాష



ప్రముఖ బాలీవుడ్ విలక్షణనటుడు నానాపాటేకర్ సెట్ల మీద ఓ విచిత్రభాషను వాడుతుంటాడట. 'నాతో పెట్టుకోవద్దు' అనే టైపు కనుక ఎవరూ అతనితో స్నేహం చేసేందుక్కూడా జంకుతారు. తన నటనతో జనాన్ని భయపెట్టే నానా భయపడే సంగతి ఒకటుంది. నానాకు అతని తల్లి అంటే చాలా భయమట. 'ఆయి' (అమ్మ) అనే పదం విన్నా ఉలిక్కిపడతాట్ట. రామ్‌గోపాల్‌వర్మ చిత్రం 'భూత్' సెట్ల మీద రేఖ, నానాను అడిగిందట, "అట్లాంటి తమాషా భాష ఎక్కడ నేర్చుకున్నావు?" అని. దానికి నానా సమాధానమేమిటో తెలుసా? "ఏం చెయ్యమంటావు? అది నా మాతృభాష!" అన్నాట్ట. నానా తన హాస్యస్ఫూర్తిని ఇలా రుజువు చేసుకున్నాడు.

ఎన్.